క్లుప్తంగా

కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రొళ్ల: మండల వ్యాప్తంగా బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణతో పాటు కాపు కులాలకు చెందిన మహిళల నుంచి కుట్టు శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. కుట్టు శిక్షణ కోసం https:// apobmms. apcfss. in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు వయసున్న మహిళలు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సిబ్బందితో సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్

రొళ్ల: గ్రామాల్లో రైతుల రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం వీఆర్వోలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ, ఆర్‌ఐ గిరియప్పతో కలిసి ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి వీఆర్వోలు, వీఆర్‌ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి మాట్లాడుతూ భూ సమస్యలు, సర్వే సబ్ డివిజన్లతో పాటు మ్యుటేషన్, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని తెలిపారు. రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



ప్లకార్డులను పట్టుకుని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష సిబ్బంది

గుడిబండ: మండల విద్యాధికారి కార్యాలయం వద్ద శుక్రవారం భోజన సమయంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు ప్లకార్డులను చేత పట్టుకొని నిరసన తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 21 రోజుల పాటు చేపట్టిన సమ్మె కాలపు ఒప్పందాలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కనీస వేతనం పెంపు, హెచ్‌ఆర్ పాలసీని తక్షణమే అమలు చేయాలన్నారు. గ్రాట్యూటీ, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్నారు. కార్యక్రమంలో భీమరాజు, ఆనంద్, శ్రీనివాస్, తిప్పేస్వామి, కెంచప్ప, బుడేన్‌సాబ్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కాలనీ వాసులు

పెనుకొండ: నగర పంచాయతీ పరిధిలోని 2వ వార్డు తిమ్మాపురం ఇందిరమ్మ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని నాయకులు.. కమిషనర్ సతీష్‌ను కోరారు. ఈ మేరకు సీపీఎం నాయకుడు హరి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, కాలనీ వాసులు రేష్మ, సుజాత, షాబీనమ్మ, మంజు, మణెమ్మ వినతిపత్రం సమర్పించారు. కాలనీలో 250 కుటుంబాలు ఉన్నాయని, ప్రతి కుటుంబం పేద కుటుంబమేనన్నారు. కాలనీలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. స్పందించిన కమిషనర్ ట్యాంకర్ ద్వారా నీటిని వెంటనే సరఫరా చేస్తామన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో షీబాక్స్ ఏర్పాటు



షీ బాక్స్ ఏర్పాటు చేసిన ఏపీజేఏసీ సభ్యులు

హిందూపురం: ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న, చెప్పుకోలేని సమస్యలు ఫిర్యాదుల రూపంలో రాసి షీబాక్స్‌లో వేస్తే వాటి పరిష్కారానికి ఏపీజేఏసీ కృషిచేస్తుందని రాష్ట్ర మహిళా విభాగం ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ పి.విజయలక్ష్మి తెలిపారు. ఇందులో భాగంగానే హిందూపురం తహసీల్దార్ కార్యాలయంలో షీ బాక్స్ ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ సమక్షంలో వారానికి ఒకసారి ఏపీజేఏసీ మహిళా విభాగం షీ బాక్స్ ఓపెన్ చేసి ఫిర్యాదులు ఏవైనా ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు.

అరిగేవే ఆరగించు .. సత్ఫలితం సాధించు !

- పరీక్షా సమయంలో సాత్వికాహారమే ఉత్తమమంటున్న వైద్యులు
- నూనె పదార్థాలతో అతి దాహం
- చికెన్, మటన్‌లకు దూరంగా ఉంటేనే మేలు





అగళి: పిల్లల ఆహారం విషయంలో తల్లిదండ్రులు ఎప్పుడూ కంగారు పడుతూనే ఉంటారు. పరీక్షల సమయంలో ఇక ఆ ఆందోళన చెప్పాల్సిన అవసరం లేదు. ఇంటర్ విద్యార్థులు ఇప్పటికే పరీక్షలు రాస్తున్నారు. పదో తరగతి విద్యార్థులు ప్రిపరేషన్ లో నిమగ్నమయ్యారు. ఉత్తమ మార్కులు రావాలని ఆహారం, నిద్రను కొందరు నిర్లక్ష్యం చేస్తుంటారు. చదువు ధ్యాసలో పడి విద్యార్థులు కూడా సరిగ్గా తిండి తినకపోతే నీరసించి పరీక్షలు రాయలేకపోతారు. ఇలాంటి సమయాల్లో తల్లిదండ్రులే డైట్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

టిఫిన్‌గా నూనె పదార్థాలు వద్దు..

ఉదయం తీసుకునే అల్పాహారంలో నూనె వస్తువులు లేకుండా చూసుకోవాలి. ఆయిల్ ఫుడ్స్‌ను బ్రేక్‌ఫాస్ట్‌లో తీసుకోవడంతో తరచూ దాహం వేస్తుంది. దీంతో పరీక్ష రాసే సమయంలో విద్యార్థులు ఇబ్బంది పడతారు. తప్పనిసరిగా అల్పాహారం తీసుకోవాలి. సులువుగా అరిగిపోయే ఆహార పదార్థాలను టిఫిన్‌గా తీసుకుంటేనే మేలు. మిక్స్‌డ్ వెజిటబుల్ కిచిడీ, గోధుమ రవ్వ ఉప్మా , ఇడ్లీ కూడా బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకోవచ్చు.

జ్ఞాపకశక్తి కోసం బీ–12 విటమిన్

విద్యార్థులు చదివింది గుర్తుపెట్టుకోటానికి విటమిన్–బీ12 ఉపయోగపడుతుంది. జ్ఞాపశక్తి పెరుగుదలకు ఉపయోగపడే ఈ విటమిన్ మాంసపు ఉత్పత్తుల్లో అధికంగా లభిస్తుంది. మాంసం తినటానికి ఇష్టపడని వారు రోజుకు రెండు ఉడికించిన గుడ్లు తినడం మంచిది. మధ్యాహ్నం భోజనంలో ఒక ఆకుకూర తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. కూరగాయలతో చేసిన కూర, పెరుగు లేదా మజ్జిగా తీసుకోవాలి. భోజనం తర్వాత ఏదైనా ఒక పండు తింటే మంచిది .

రాత్రి 7.30 కల్లా భోజనం ముగించాలి

రాత్రి భోజనం 7.30 గంటలకల్లా ముగిస్తే చాలా మంచిది. పప్పుకూర, రసం, సాంబారు, పెరుగు, మజ్జిగ ఉండేలా చూసుకోవాలి. నిద్రకు గంట ముందుగా గ్లాసు పాలు తాగడం ఉత్తమం. రాత్రిళ్లు ఎక్కువ సమయం వేచి ఉండవద్దు. సరిపడా కంటికి నిద్ర లేకపోతే అనేక అనర్థాలు తలెత్తుతాయి. కనీసం ఏడు గంటలు నిద్ర పోవడం మంచిది. సీజన్‌లో లభించే పండ్లు, ముఖ్యంగా విటమిన్ సీ ఎక్కువగా లభించేవి తీసుకోవడం చాలా మంచిది.

మడకశిర నియోజకవర్గంలో విద్యార్థుల సంఖ్య

మండలం	పది విద్యార్థులు	ఇంటర్ విద్యార్థులు
అగళి	370	246
గుడిబండ	507	479
రొళ్ల	410	200
మడకశిర	1180	2,722
అమరాపురం	608	541

మాంసాహారం తగ్గించటం ఉత్తమం



పరీక్షల సమయంలో విద్యార్థుల్లో విపరీతమైన ఒత్తిడి వల్ల ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్ ఎక్కువ అవుతుంటాయి. వాంతులు, విరోచనలు, కడుపులో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. విద్యార్థులు సాఫ్ట్ డైట్ తీసుకోవాలి. ముఖ్యంగా వెజిటబుల్స్, ఫ్రూట్స్ సలాడ్స్ ఎక్కువగా తీసుకుని మాంసాహారాన్ని సాధ్యమైనంత మేర తగ్గించడం చాలా మంచిది. రాత్రిపూట 7 గంటలకల్లా భోజనం చేయాలి.

– శివనంద, వైద్యుడు, అగళి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



చిలమత్తూరు: మహిళలకు హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటనలో విడుదల చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారని, మహిళలకు పెద్ద పీట వేసి అన్ని రంగాల్లోనూ అవకాశాలు కల్పించారని కొనియాడారు. మహిళలు అదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు.

బకాయి వేతనాలు ఇప్పించండి



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న కార్మికులు

హిందూపురం: ఇతర రాష్ట్రాల నుంచి వలసవచ్చి పనిచేస్తున్న కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని తూమకుంట పారిశ్రామికవాడ కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి శుక్రవారం కార్మికశాఖ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ హిందూపురం మండలం గోళాపురం పారిశ్రామిక వాడలోని ఓ స్పెల్ స్మెల్టర్స్ స్టీల్ ఫ్యాక్టరీలో బీహార్, యూపీ , ఒరిస్సా తదితర రాష్ట్రాల నుంచి పొట్ట కూటి కోసం వలస వచ్చి కష్టపడి పనిచేస్తున్న కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. కార్మికులను పారిశ్రామిక వాడకు తీసుకువచ్చిన భువనేశ్వర్‌కు చెందిన కాంట్రాక్టర్ తరుణ్ కార్మికులను ఫ్యాక్టరీలో వదిలేసి రెండు నెలలుగా కనిపించడంలేదన్నారు. ఫ్యాక్టరీలో కష్టపడిపనిచేసినా యాజమాన్యం జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. వెంటనే ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు చేపట్టి కార్మికులకు రావాల్సిన బకాయిలు ఇప్పించాలన్నారు.

11న జాబ్‌మేళా

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 11న జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు కంపెనీలు ఉద్యోగ మేళాలో పాల్గొంటాయని పేర్కొన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పూర్తీ చేసిన 18 నుంచి 33 సంవత్సరాల వయసులోపు వారు అర్హులన్నారు. జీతం రూ. 13 వేల నుంచి 18 వేలు ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు పాలసముద్రం, పెనుకొండ, హిందూపురంలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ శివప్రసాద్ 9676706976ను సంప్రదించాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



హనుమక్క మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దీపిక

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలం మిట్టమీదపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కడపల పురుషోత్తంరెడ్డి తల్లి హనుమక్క గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక మిట్టమీదపల్లికి వెళ్లి హనుమక్క మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మహేష్ గౌడ్, ప్రణయ్‌రెడ్డి, కవితరెడ్డి, రాజేష్ తదితరులున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



దుర్గానగర్ వార్డు కమిటీ సభ్యులతో మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: గ్రామస్థాయి నుంచే వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడే వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. శుక్రవారం దుర్గానగర్‌లో వార్డు కమిటీని ఎన్నిక చేశారు. బూత్ కన్వీనర్‌గా బాబు, అధ్యక్షుడిగా ఆదినారాయణరెడ్డి, బీసీ సెల్‌కు సూరి, రైతు విభాగానికి లక్ష్మీనారాయణ, చేనేత విభాగానికి వెంకటేష్, ఎస్టీ సెల్‌కు చంద్రనాయక్, ఉపాధ్యక్షుడిగా వేణు, యువజన విభాగానికి గణేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యువజన విభాగం మండలాధ్యక్షుడు జితేంద్రరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు మంజు, నాయకులు శ్రీనివాసులు, ఇమామ్‌వలి తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్నా సంక్షేమ ఫలాలకు దూరం

- దీనావస్థలో సునీతమ్మ కుటుంబం



నలుగురు పిల్లలతో సునీతమ్మ

పావగడ: తాలూకాలోని పళవల్లి గ్రామ పంచాయతీ వీరమ్మనహళ్లి గ్రామంలోని అనాథ దళిత మహిళ సునీతమ్మ అన్ని అర్హతలు ఉన్నా ప్రభుత్వ పథకాలకు నోచుకోలేదు. ఆమె భర్త సిద్ధరాజ్ మూడేళ్ల క్రితం తీవ్ర అనారోగ్యంతో చనిపోయాడు. ఆమె కూలి పని చేస్తూ ముగ్గురు ఆడ పిల్లలతో పాటు మూడేళ్లున్న ఓ మగ పిల్లాడితో జీవనం సాగిస్తోంది. అధికారుల పుణ్యమా అని శిథిలావస్థకు చేరిన ఇంటిలోనే కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ముగ్గురు ఆడపిల్లలను బడికి వదిలి చిన్న పిల్లవాడిని ఎత్తుకొనే కూలి పనులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వ పథకాలు పొందేందుకు అన్ని అర్హతలు ఆమెకు ఉన్నా స్థానిక గ్రామ పంచాయతీ , రెవెన్యూశాఖ అధికారులకు మాత్రం ఆమెపై కరుణ చూపడం లేదు. రేషన్‌కార్డు, వితంతువు పింఛన్ కోసం ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా.. కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకపోయింది. సాధారణంగా ఎన్నికల గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, నివాస స్థల ధ్రువీకరణ పత్రం ఉంటే చాలు ఆశ్రయ పథకం కింద ఇంటి నిర్మాణం, అన్నభాగ్య పథకం కింద రేషన్‌కార్డు కల్పించే అధికారులు దళిత మహిళకు మాత్రం అన్యాయం చేస్తుండటాన్ని స్థానికులతో పాటు స్థానిక కర్ణాటక రాజ్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప తప్పుబట్టారు. వెంటనే సునీతమ్మ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించి ఆదుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.

ఇంటర్ పరీక్షకు 28 మంది గైర్హాజరు

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం జరిగిన ఇంటర్ పరీక్షలకు 28 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. మొత్తం ఏడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 5 మండలాల పరిధిలో మొత్తం 1728 విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా..1700 మంది విద్యార్థులు మాత్రమే హాజరైనట్లు అధికారులు తెలిపారు.

మహిళా శక్తి ఎంతో గొప్పది



సానిపల్లిలో మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

పెనుకొండ: మహిళా శక్తి ఎంతో గొప్పదని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ నిర్వాహకులు శిల్పా అనుపాటి పేర్కొన్నారు. పట్టణంలోని అర్బన్ కాలనీలోని శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీఓ శాంతలక్ష్మి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శిల్పా అనుపాటి మాట్లాడుతూ ప్రతి మహిళా తన కుటుంబ నిర్వహణలో ఆది పరాశక్తి అని, తన శక్తిని సక్రమంగా వినియోగించుకున్నట్లయితే మహిళలు సాధించలేనిది ఏదీ లేదన్నారు. అంగన్‌వాడీల సమస్యలపై తాను ఎప్పుడు అక్కగా, చెల్లిగా ముందుంటానన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

రొద్దం: మండల పరిధిలోని సానిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నారాయణస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. పెద్దగువ్వలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు సరస్వతమ్మ, జయమ్మ, లక్ష్మీనరసమ్మ, అమృత, భోజన ఏజెన్సీ నంజుమ్మ, ఆయా లక్ష్మీదేవమ్మను సన్మానించారు.

ఆత్మరక్షణకు యుద్ధకళలు అవసరం



సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్ రామచంద్ర

హిందూపురం: 'ప్రస్తుత సమాజంలో ఆరోగ్యంతో పాటు ఆత్మ రక్షణకు యుద్ధకళలు చాలా అవసరం. బాలికలకు చిన్నతనం నుంచి ఆత్మరక్షణ విద్యలో నైపుణ్యం పొందటం ఎంతో ముఖ్యం' అనికరాటే గ్రాండ్ మాస్టర్ రామచంద్ర అన్నారు. డీఈఓ ఆదేశాలతో సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో కొట్నూరు ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం 6వ తరగతి నుంచి 9వ తరగతి చదివే బాలికలకు ఉచిత సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రామ్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శోభా, పీడీ రామకృష్ణ పాల్గొన్నారు. మరోవైపు ముదిరెడ్డిపల్లి, చౌడేశ్వరీకాలనీలోని ఎంపీయూపీ స్కూల్స్, జెడ్పీహైస్కూల్స్‌లోని విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ కోర్సులు ప్రారంభించారు. కరాటే శిక్షకులు ఫైరోజ్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎంలు సుధామణి, వహీదా ఖనం, మధు సుదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ పక్కాగా చేయాలి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



గోరంట్ల: ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న జేసీ

చిలమత్తూరు: ఈ–క్రాప్ బుకింగ్ పక్కాగా నిర్వహించాలని జేసీ అభిషేక్‌కుమార్ వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని దేమకేతేపల్లి, మొరసలపల్లి, సోమఘట్ట గ్రామాల్లో ఈ– క్రాప్ బుకింగ్ జరుగుతున్న తీరు పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతాంగానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని, రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సంక్షేమ పథకం వారికి చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్న వారికే పరిహారం అందుతుందని, రైతులు కచ్చితంగా ఈ క్రాప్ చేయించుకోవాలని సూచించారు. అధికారులు కూడా చొరవ చూపాలన్నారు.

గోరంట్ల: మండల పరిధిలోని తిప్పరాజుపల్లిలో జరుగుతున్న ఈ క్రాప్ బుకింగ్‌ను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. తిపారాజుపల్లికి చెందిన రైతు నరసింహారెడ్డి 538 సర్వేనంబర్‌లో సాగు చేసిన వరి పంట ఈ క్రాప్ బుకింగ్‌ను ఆయన క్రాస్ చెక్ చేశారు. రైతు నరసింహారెడ్డితో ఈ క్రాప్ బుకింగ్ చేసిన తీరుతెన్నులను జేసీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

కదిరేపల్లిలో వారపు సంత వేలం

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి క్రాస్ సమీపంలో నిర్వహిస్తున్న వారపు సంత వేలం పాటను శుక్రవారం సర్పంచ్ నర్సేగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ వేలం పాటలో రామాంజప్ప రూ.34 వేలకు దక్కించుకున్నారని ఈఓఆర్డీ నాగరాజునాయక్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పరిగి: మండలం పరిధిలోని జయమంగళీ నది పరివాహక ప్రాంత సరిహద్దు మడకశిర నియోజకవర్గం కేతేపల్లి వద్ద నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరును పట్టుకున్నట్లు ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు. అలాగే మండల పరిధిలోని పైడేటి వద్ద పెన్నా నది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టరును రెవెన్యూశాఖ అధికారులు పట్టుకున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

మడకశిరరూరల్: మండలంలోని గుండుమల గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖన, ఆంగ్లంలో చేతిరాత పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు రూరల్ సీఐ రాజ్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫణీంద్ర సాగర్, ఎంఈఓ భాస్కర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి – గుణేహళ్లి రహదారి మధ్యలో రెండు ద్విచక్ర వాహనాలు శుక్రవారం రాత్రి ఢీ కొనడంతో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు.. మండలంలోని నిద్రగట్టకు చెందిన మూర్తి తన కూతురు గంగోత్రి వివాహం ఈ నెల 16న కర్ణాటక రాష్ట్రం లక్కనహళ్లిలో జరిపేందుకు నిశ్చయించారు. పెళ్లి పత్రికలు పంచేందుకు శుక్రవారం ఉదయం బైక్‌లో వెళ్లాడు. రాత్రి తిరిగా స్వగ్రామానికి బయలు దేరారు. అయితే హేమావతి నుంచి వస్తున్న నింగరాజు ద్విచక్ర వాహనం, మూర్తి బైక్ రెండు పరస్పరం ఢీ కొన్నాయి. మూర్తి తీవ్రంగా గాయపడగా, నింగరాజు స్వల్పంగా గాయపడ్డాడు. మూర్తిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

కొల్లాపురి అమ్మవారికి హారతులు

అమరాపురం: మండల పరిధిలోని గొడనకుంట గ్రామంలో వెలసిన కొల్లాపురి అమ్మవారికి భక్తులు హారతుల ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం ఆలయం మహిళలు హారతులిచ్చి మొక్కులు చెల్లించారు.

ఘనంగా జాతరోత్సవం



దేవుళ్లను ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ: పావగడ తాలూకా సమీప సరిహద్దులోని బెస్తరపల్లిలో వెలసిన కర్ణాటక కాడు గొల్లల ఆరాధ్య దైవాలైన క్యాతలింగేశ్వర, బొమ్మలింగేశ్వర, చిత్రలింగేశ్వర, ఈరణ్ణ స్వామి, కాటమలింగేశ్వర, యల్లమ్మ దేవి, మారమ్మ దేవతల దొడ్డ (పెద్ద) జాతరోత్సవం ఘనంగా జరిగింది. 95 సంవత్సరాల అనంతరం నిర్వహించిన ఈ మహోత్సవంలో తుమకూరు, బళ్లారి, చిత్రదుర్గం, అనంతపురం ప్రాంతాల నుంచి సుమారు 80 దేవుళ్లను ఊరేగింపుగా బెస్తరపల్లి గ్రామానికి తరలించారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. స్వామివార్లకు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. కర్ణాటక వనకల్లు మల్లేశ్వర మఠం పీఠాధ్యక్షుడు బసవ రమానంద మహా స్వామి మాట్లాడుతూ... బుడకట్టు సంప్రదాయంలో మరదైవ (వృక్ష దైవం), కల్లుదైవ (రాతి దైవం), పంచలోహ దైవాలకు పూజలు చేస్తామన్నారు. అన్ని సామాజిక వర్గాల వారు దేవుళ్లను పూజిస్తారన్నారు.